క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య



వీపనగండ్ల: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలోనూ అన్ని రకాల వసతులు ప్రభుత్వం కల్పిస్తున్నందున తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని మహిళా సంఘం అధ్యక్షురాలు విజ్ఞప్తి చేశారు. మంగళవారం గోవర్ధనగిరిలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అక్కాల లక్ష్మి, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటస్వామితో కలిసి ఇంటింటికీ తిరుగుతూ విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం



పెబ్బేర్‌రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ సీజనల్‌గా వచ్చే వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని పంచాయతీ కార్యదర్శి రహేనాసుల్తాన ప్రజలకు సూచించారు. మంగళవారం మండలంలోని సవాయిగూడెంలో పర్యటించి వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలకు దూరంగా ఉండవచ్చన్నారు. ప్రాథమిక పాఠశాలను సందర్శించి పాఠశాల అవరణను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



పెబ్బేరు రూరల్: మండలంలోని రంగాపురం ప్రాథమిక పాఠశాలలో సుదీర్ఘకాలం పాటు పనిచేసిన దుర్గాప్రసాద్, స్రవంతి, శ్రీరంగాపురం మండలంలోని వెంకటాపురం ప్రాథమిక పాఠశాల్లో పనిచేసిన చంద్రయ్య, తిమ్మప్ప, శ్వేత ఇటీవల బదిలీపై వెళ్లారు. బదిలీ అయిన ఉపాధ్యాయులకు, పాఠశాలకు నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులకు మంగళవారం గ్రామస్తులు, ఉపాధ్యాయులుతో కలిసి వారిని సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శివశంకర్, ఉపాధ్యాయులు మోహన్‌గౌడ్, శ్రీనివాసరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ఈశ్వర్‌గౌడ్, కృష్ణయ్యగౌడ్, వెంకటయ్య, గ్రామస్తులు గట్టయ్య, శంకర్‌నాయుడు, ధర్మ, రామస్వామి, చంద్రమ్మ, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కలను తరలించాలి



వీపనగండ్ల: తమ గ్రామంలో వీధి కుక్కల దాడి అధికమయ్యిందని అధికారులు స్పందించి గ్రామం నుంచి వీధి కుక్కలను తరలించాలని కోరుతూ మంగళవారం గోవర్ధనగిరి గ్రామస్తులు ఎంపీడీఓ శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో పసిపిల్లలు, లేగ దూడలు, గొర్రెలు, కోళ్లపై తరచూ వీధి కుక్కలు దాడులు చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కుక్కల నుంచి రక్షణ పొందేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సూర్యవంశం వెంకటస్వామి, గ్రామస్తులు రాజశేఖర్‌రెడ్డి, ఆంజనేయులు, నవీన్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గోపాల్‌పేట: మున్ననూరుకు చెందిన వ్యక్తి హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే గోపాల్‌పేట మండలంలోని మున్ననూరుకు చెందిన సోడ వెంకటయ్య (55) ఇటీవల సొంత గ్రామంలోని తన ఇంట్లో గ్యాస్ సిలిండర్ రిపేర్ చేస్తుండగా మంటలు చెలరేగి తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతి

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణంలోని పలు సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందించినా వారు స్పందించడం లేదని అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్‌యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా అధికారుల, ప్రజాప్రతినిధుల మనస్సు మార్చాలని కోరుకుంటూ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అంబేడ్కర్‌కు అందజేశారు. కార్యక్రమంలో టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు కాదర్‌పాషా, గొల్ల శంకర్, సీపీఐ నాయకులు రమేష్, సతీష్, గొనికాడి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

- వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటిన అధికారులు, నాయకులు
- అందరూ భాగస్వాములవ్వాలని పిలుపు



వెనకితండాలో మొక్కలు నాటుతున్న నాయకులు, గిరిజన మహిళలు

ఖిల్లాఘనపురం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బీజేపీ మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడు, ఎస్టీమోర్చా జిల్లా అధ్యక్షుడు రవినాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని వెనికితండా పంచాయతీలో రవినాయక్ ఆధ్వర్యంలో గ్రామస్తులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు భవిష్యత్ తరాల రక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా కనీసం 5 మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, దశరథ, తుల్చానాయక్, హన్మనాయక్, పాండునాయక్, గిరిజన మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: వనమహోత్సవంలో భాగంగా మంగళవారం శ్రీరంగాపురం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, వారి సిబ్బందితో కలిసి స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని గ్రామ ప్రజలకు సూచించారు.



శ్రీరంగాపురం పోలీస్ స్టేషన్‌లో..

బాధితులకు ఆర్థికసాయం అందజేత



భాస్కర్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు

పెబ్బేర్‌రూరల్: పట్టణ కేంద్రానికి చెందిన రిపోర్టర్ భాస్కర్‌కు మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు బాలవర్ధన్ ఆధ్వర్యంలో మంగళవారం రూ.12 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల రైతు సంబరాల్లో న్యూస్ కవరేజీ చేస్తున్న క్రమంలో రిపోర్టర్ భాస్కర్ ప్రమాదవశాత్తు కిందపడి కాలుకు గాయమైంది. దీంతో అతడి ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం మండల ప్రెస్‌క్లబ్ సభ్యులు చందాలు పోగు చేసి ఇచ్చినట్లు అధ్యక్షుడు పేర్కొన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు శ్రీనివాసులు, చిరంజీవి, పరశురాం, రాజేంద్రప్రసాద్, అతిఖ్‌పాష, మందరాములు తదితరులు పాల్గొన్నారు.



వనపర్తిలో..

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని 19వ వార్డులో మహ్మద్ గున్న మృతి చెందిన విషయాన్ని స్థానిక కౌన్సిలర్ చంద్రకళ, ఎల్‌ఐసీ కృష్ణ ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మున్సిపల్ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్ మంగళవారం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఉంటుందని దిగులు చెందొద్దన్నారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ద్యారపోగు వెంకటేష్, చీర్ల గోపికృష్ణ, తిరుపతినాయక్ తదితరులు ఉన్నారు.

బుద్దారం ఆలయ ధర్మకర్తల నియామకం

గోపాల్‌పేట: మండలంలోని బుద్దారం గండి ఆంజనేయస్వామి ఆలయ ధర్మకర్తలను దేవాదాయ శాఖ ప్రకటించింది. ఆలయ ధర్మకర్తలుగా పెంటారావు, మధుకర్‌రావు, తిరుపతయ్య, బల్మూరి రవిగౌడ్, బందుల భాగ్యమ్మ, ముడావత్ తార్య, పానుగంటి లక్ష్మిలను ఆలయ ధర్మకర్తలుగా ప్రకటిస్తూ మంగళవారం దేవాదాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కమిటీ ఏర్పాటు అయ్యేందుకు సీఎం రేవంత్‌రెడ్డితో చర్చ లు జరిపారని, ఇందుకుగాను ధర్మకర్తలుగా ఎంపికైన వారు ఎమ్మెల్యే, సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

కొత్తకోట: మదనాపురం మార్కెట్ యార్డు చైర్మన్‌గా నియమితులైన పల్లెపాగ ప్రశాంతను ఆర్యవైశ్య సంఘం నాయకులు బాదం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పట్టణంలోని పలువురు ప్రముఖులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ఉండటంతో పార్టీ గుర్తించి సముచిత గౌరవం కల్పించిందన్నారు.

పత్తిలో చీడపీడల నివారణపై అవగాహన

ఖిల్లాఘనపురం: పత్తి పంట సాగు, చీడపీడల నివారణపై మంగళవారం రైతులకు రైతు నేస్తం కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించారు. మండలంలోని పర్వతాపురం రైతువేదికలో రైతు నేస్తం ద్వారా దృశ్యమాధ్యమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ కిరణ్‌బాబు, డాక్టర్ ప్రవీణ్ రైతులకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత సమయంలో అధిక వర్షాల కారణంగా పత్తి పంటకు కాపర్ ఆక్సిడ్ క్లోరైడ్ మందును ఒక లీటర్ నీటిలో 3 గ్రాముల మందును కలిపి పంటల మొదళ్ల వద్ద వేయాలన్నారు. అదేవిధంగా వ్యవసాయ అధికారులకు పంటలు చూపించి వారి సూచనల మేరకు 13–0–45 ఎరువును ఒకలీటర్ నీటిలో 3గ్రాముల మందు, బోరాన్ ఎరువును ఒక లీటర్ నీటిలో 2 గ్రాములు కలిపి పత్తి పంటలకు వేయాలని సూచించారు. ముందుగా పంటలో నిలిచిన వర్షపు నీరు బయటకు వెళ్లేలా బాటలు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని చెన్నారం రైతువేదికలో మంగళవారం వ్యవసాయ అధికారులు రైతులకు పంటల సాగుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను నేరుగా శాస్త్రవేత్తల ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు సాగుపై ఉన్న అనుమానాలను నివృతి చేశారు. యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణ, రసం పీల్చే పురుగుల నివారణ కోసం తీసుకోవాల్సి జాగ్రత్తలను వివరించారు. రసం పీల్చే పురుగులను గమనించిన వెంటనే రైతులు ఫిప్రోనిల్ రెండు మిల్లీలీటర్లు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పచ్చిరొట్ట, వర్మీకంపోస్ట్ ఎరువులు, జీవ ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏ చంద్రశేఖర్, ఏఈఓ ఫెరోజ్, కేవీకే శాస్త్రవేత్త భవాని, రైతులు పాల్గొన్నారు.

శాస్త్రీయ పంట విధానంతో అధిక లాభాలు

వీపనగండ్ల: శాస్త్రీయ పద్ధతిలో పంటలను సాగు చేసుకోవడం వల్ల అధిక దిగుబడులను పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం వరి, వేరుశనగ, కంది పంటల్లో చీడపీడల నివారణ, యాజమాన్య పద్ధతులు అనే అంశంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హైదరాబాద్ నుంచి శాస్త్రవేత్తలు ఇచ్చిన సలహాలను రైతులతో కలిసి వీక్షించారు. అధిక దిగుబడులు పొందేందుకు పంట కాల్వల ఏర్పాటు, తక్కువ సమయంలో పంట చేతికి వచ్చే వరి రకాలను సాగు చేసుకోవాలని శాస్త్రవేత్తలు సూచించినట్లు ఏఓ తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ రజిత, రైతులు పాల్గొన్నారు.

రామన్నగట్టు రిజర్వాయర్‌కు నిధులు కేటాయించాలి

పాన్‌గల్: మండలంలోని కిష్టాపూర్ సమీపంలో నిర్మించే రామన్నగట్టు రిజర్వాయర్‌కు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించి నిర్మాణం పనులు ప్రారంభించేలా తగు చర్యలు తీసుకోవాలని రేమద్దుల మాజీ ఎంపీటీసీ సభ్యుడు కర్ణాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ రిజర్వాయర్ నిర్మాణంతో మండలంతో పాటు వనపర్తి మండలంలోని రైతులకు కూడా ప్రయోజనం కలుగుతుందని తెలిపారు.

నేడు సీపీఎం మండల కమిటీ సమావేశం

పాన్‌గల్: మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో బుధవారం పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కార్యదర్శి బాల్యానాయక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ హాజరవుతున్నారని ఆయన పేర్కొన్నారు. మండల కమిటీ సభ్యులు ప్రతి ఒక్కరూ పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

‘రైతుబీమా’కు దరఖాస్తుల ఆహ్వానం



మదనాపురంలో..



బునాదిపురంలో రైతులకు అవగాహ చేస్తున్న ఏఈఓ నరేష్

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రైతుబీమాకు సంబంధించి కొత్తగా పాస్‌పుస్తకాలు పొందిన రైతులు ఈనెల 27 లోపు దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వినయ్‌కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏఈఓలు మహేశ్వరి, సింధూజతో కలిసి రైతులకు వివిధ అంశాలపైన అవగాహన కల్పించారు. కొత్తగా రైతుబీమా, రైతుబంధుకు దరఖాస్తులు చేసుకునే వారు పట్టాదారు పాస్ పుస్తకంతో పాటు నామినీ ఆధార్‌కార్డులు, బ్యాంక్ ఖాతా బుక్కు జిరాక్స్‌తో తీసుకురావాలన్నారు. అలాగే రుణమాఫీ మొదటి విడతలో అమరచింత, ఆత్మకూర్ మండలాలకు గాను 2,520 మంది రైతులకు రూ.14.40 కోట్ల రుణాలు మాఫీ అయ్యిందని తెలిపారు.

వీపనగండ్ల: అర్హులైన రైతులందరూ రైతుబీమా పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్‌గౌడ్, ఏఈఓలు రజిత, శివ రైతులకు విజ్ఞప్తి చేశారు. 18ఏళ్ల వయసు నుంచి 59 ఏళ్ల లోపు గల రైతులు వచ్చే నెల 4వ తేదీ వరకు దరఖాస్తులను సంబంధిత వ్యవసాయ కార్యాలయంలో అందజేయాలని కోరారు. రైతుబీమాలో తమ పేర్లను నమోదు చేసుకున్న రైతులు ప్రమాదవశాత్తు చనిపోతే రూ.5 లక్షల ఆర్థిక సాయం ప్రభుత్వం నుంచి అందుతుందన్నారు.

మదనాపురం: మండలంలోని రైతులు వచ్చే నెల 5వ తేదీలోగా రైతుబీమా దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి స్పందన కోరారు. మంగళవారం మదనాపురం రైతువేదికలో రైతులకు రుణమాఫీ వివరాలను వెల్లడించారు. రైతుబీమాలో తప్పుల సవరణ ఈనెల 30వ తేదీ వరకు అవకాశం ఉందని, ఇది వరకు దరఖాస్తు చేసుకున్న రైతులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు.

పెబ్బేరు రూరల్: మండలంలోని బునాదిపురంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం మండల వ్యవసాయ విస్తరణ అధికారి నరేష్ ఆధ్వర్యంలో రైతుబీమా పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రైతుబీమాలో ఏమైనా తప్పులు ఉంటే సవరణ చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం క్రాప్‌లోన్‌లో భాగంగా రూ.లక్ష వరకు రుణమాఫీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతులు వెంకటేష్‌సాగర్, బాలరాజు, నరేందర్, శ్యామ్, మౌలాలి, వెంకటయ్య పాల్గొన్నారు.


బాల కార్మికుడిని పనిలో పెట్టుకున్నందుకు కేసు నమోదు

పాన్‌గల్: మండల కేంద్రంలోని హెయిర్ కటింగ్ షాపులో బాల కార్మికుడితో పనిచేయిస్తున్నందుకు యజమానిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ రోషయ్య తెలిపారు. హెచ్‌సీ తెలిపిన వివరాల ప్రకారం హెయిర్ కటింగ్ షాపు యజమాని రఘు తన షాపులో బాల కార్మికుడితో పనిచేయిస్తున్నారని తెలియడంతో జిల్లా లేబర్ ఆఫీసర్ నిశాంత్‌కుమార్ టీం ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి బాలకార్మికుడితో పని చేయిస్తున్నట్లు గుర్తించారు. దీంతో లేబర్ ఆఫీసర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చైల్డ్ లేబర్ యాక్ట్ 1956 ప్రకారం షాపు యజమాని రఘుపై కేసు నమోదు చేసుకొని బాలుడిని చైల్డ్ హోంకు తరలించినట్లు హెచ్‌సీ పేర్కొన్నారు. బాలకార్మికులచే పనులు చేయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు. ఈ దాడులల్లో ఎస్‌బీ ఎస్‌ఐ అలీబేగ్, సిబ్బంది నర్సింహ, ఆశోక్, కన్నన్ పాల్గొన్నారు.

రాయల చంద్రశేఖర్ ఆశయాలను కొనసాగిద్దాం

అమరచింత: ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడుతూ.. పాలకులు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక ధోరణిపై గళం విప్పిన రాయల చంద్రశేఖర్ ఆశయ సాధనలో నేటితరం యువకులు ముందుకు సాగాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం అన్నారు. మండల కేంద్రంలోని మార్క్స్ భవనంలో మంగళవారం రాయల చంద్రశేఖర్ సంతాప సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి అరుణ్ కుమార్, హన్మంతు, సీహెచ్ రాంచందర్, రాజు, రాజన్న, చింతలన్న, అబ్రహం, కేశవులు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.


వేతన జీవులకు ఊరట లేదు..



బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వేతన జీవులకు ఏమాత్రం ఊరట ఇవ్వలేదు. ఇన్‌కం ట్యాక్స్ స్లాబ్స్‌ను మార్చాలి. స్టాండర్డ్ డిడక్షన్ రూ.50 వేల నుంచి రూ.75 వేలకు పెంచడం పాత పన్ను విధానంలో మార్పులు చేయకపోవడం వంటివి. కొత్త పన్ను విధానం ఎంచుకున్న వారికి కొంత ఊరటనిచ్చింది. పేద, మధ్య తరగతి ప్రజ లకు ఉపయోగంలేని బడ్జెట్. నిజంగా రైతులపై ప్రే మ ఉంటే ఎరువులు, పురుగుల మందుల రేట్లు ఏ మాత్రం తగ్గించలేదు. పెట్రోల్, డీజిల్ ధరలను పెంచేటప్పుడు రాష్ట్రాల అభిప్రాయాలు తీసుకోవాలి.

– బండి శ్రీను, ఉపాధ్యాయుడు, పాన్‌గల్


తెలంగాణకు మొండి చేయి



ఈసారి బడ్జెట్‌లో రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఆశించాం. కానీ ఆశలపై ఎన్డీఏ ప్రభుత్వం నీళ్లు చల్లింది. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఆశించిన స్థాయిలో ప్రజలు పట్టం కట్టినా బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం చేసింది. ఎంతో ఆశతో మూడోసారి అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ చిన్న, సన్నకారు రైతులకు ఈ బడ్జెట్‌లో పెద్దగా ప్రాధాన్యం ఇవ్వకపోవడం బాధాకరం.

– మధుగౌడ్, చిన్నంబావి


ఆశాజనకంగా ఉంది



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కొద్దిపాటి ఆశాజనకంగా ఉంది. పన్ను చెల్లింపుదారులకు ఊరటనివ్వడంతో పాటు రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చింది. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ముద్ర రుణాలకు పెద్ద మొత్తంలో చెల్లింపులు చేసింది. విద్యారంగానికి, వైద్య రంగాన్ని బలోపేతం చేసే ప్రయత్నం చేసింది.

– రాఘవరెడ్డి, రిటైర్డ్ ఉద్యోగి, వనపర్తి

పదేళ్లుగా నిరాశే..



కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయింపులు పెద్దగా పెరగలేదు. మధ్యతరగతి ఉద్యోగికి బడ్జెట్ ఆశాజనకంగా లేదు. ఆదాయ, స్లాబ్ పన్నుల్లో మినహాయింపులు పెద్దగా లేవు. పదేళ్లుగా నిరాశే మిగులుతుంది. దేశంలో ఆదాయం పన్ను వసూళ్లలో కార్పొరేట్ పన్ను కంటే వ్యక్తిగత పన్ను ఎక్కువగా వసూలవుతుంది. కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయకపోవడం అన్యాయం.

– రవి ప్రసాద్‌గౌడ్, ఉపాధ్యాయుడు, వనపర్తి

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పాఠశాల హెచ్‌ఎం కాళిదాసు తెలిపారు. వారిలో 20 మంది విద్యార్థులు జలుబుతో బాధపడుతున్నట్లు వైద్యులు గుర్తించారన్నారు. అదేవిధంగా శ్వాస సంబంధిత సమస్యతో ఒక్కరు, జ్వరంతో 15 మంది, చర్మ సంబంధిత వ్యాధితో ఇద్దరు విద్యార్థులు బాధపడుతున్నట్లు వైద్యులు డాక్టర్ స్వప్న తెలిపారు. విద్యార్థులందరికీ వానాకాలం సీజన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సూచనలు చేశామన్నారు. అవసరమైన విద్యార్థులకు ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో ఫార్మాసిస్టు శ్రీవిద్య, ఏఎన్‌ఎం లక్ష్మి, అర్జున్, పీఈటీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్మితాసబర్వాల్ వ్యాఖ్యలు సరికాదు



చిన్నంబావిలో మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

చిన్నంబావి: కేంద్ర ప్రభుత్వ సర్వీసు ఉద్యోగంలో దివ్యాంగుల కోటాపై స్మితాసబర్వాల్ చేసిన అనుచిత వ్యాఖ్యలను బీఎస్పీ మండల అధ్యక్షుడు కురుమయ్య తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతిభ అనేది ఎవరి సొంతం కాదని శారీరక వైకల్యం అనేది మేధాశక్తిపై ప్రభావం చూపదని, ఇలాంటి వ్యాఖ్యలు అర్థరహితమని ధ్వజమెత్తారు. అనేక మంది దివ్యాంగులు సివిల్ సర్వెంట్లుగా, రాజకీయ వేత్తలుగా, డాక్టర్లుగా వారి వారి రంగాల్లో దేశానికి విశేష సేవలు అందించిన విషయం స్మితాసబర్వాల్ మరిచిపోయారా అని ప్రశ్నించారు. ఆమె మాటలను వెనక్కి తీసుకొని, దివ్యాంగులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంజి, ప్రశాంత్, మధు పాల్గొన్నారు.



అమరచింతలో..

దివ్యాంగులపై అనుచిత వ్యాఖ్యలు తగవు

అమరచింత: దివ్యాంగులకు ఐఏఎస్ పోస్టింగ్‌ల్లో రిజర్వేషన్లు ఎందుకు కల్పించాలని దివ్యాంగులకు కించపరిచేలా ట్విట్టర్‌లో పోస్టు చేసిన సీనియర్ ఐఏఎస్ అధికారిపై కేసు నమోదు చేయాలని మండల ఎన్‌పీఆర్‌డీ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి స్మితసబర్వాల్ దివ్యాంగులను కించపరిచే విధంగా మాట్లాడటం తగదన్నారు. రాజ్యాంగ విలువలను సంరక్షించాల్సిన సీనియర్ ఐఏఎస్ అధికారి ఇలాంటి ఘటనలకు పాల్పడటం శోచనీయం అన్నారు. కార్యక్రమంలో రామాంజనేయులు, కళానందం, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

కొత్తకోట రూరల్: మండలంలోని అప్పరాలకు చెందిన రాజు ఇటీవల గుండెపోటుతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చేరారు. పరీక్షించిన డాక్టర్లు గుండె ఆపరేషన్ చేయాలని కుటుంబ సభ్యులకు సూచించారు. రాజు కుటుంబ పరిస్థితిని స్థానిక కాంగ్రెస్ నాయకులు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.3.40లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. మంజూరైన ఎల్‌ఓసీని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. తమ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నుంచి ఎల్‌ఓసీ రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యేకు, స్థానిక కాంగ్రెస్ నాయకులకు బాధితుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, బీచుపల్లియాదవ్, మాసన్న, గోపిగౌడ్, శ్రీనివాసులు, అబ్దుల్లా తదితరులు ఉన్నారు.



బాధితులకు ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

పోచమ్మ తల్లి సల్లంగా చూడమ్మా



ఆత్మకూర్‌లో అమ్మవారి బోనంతో ఊరేగింపు చేస్తున్న భక్తులు

ఆత్మకూర్: పట్టణంతో పాటు మండలంలోని గ్రామాల్లో మంగళవారం పోచమ్మ బోనాలను పెద్ద ఎత్తున ఘనంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక మున్సిపాలిటీ, పంచాయతీల ఆధ్వర్యంలో ఆలయాల వద్ద ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. ఈ సందర్భంగా మహిళలు పోచమ్మ ఆలయాల వద్దకు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి పచ్చిపులుసు, అన్నం, కోళ్లు, పొటేళ్లను బలిచ్చి మొక్కులు సమర్పించారు. పోలీసులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆత్మకూర్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, కౌన్సిలర్లు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నాయకుల ప్రత్యేక పూజలు

టీపీసీసీ అధికార ప్రతినిధి, గీత కార్మిక డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేశం నాగరాజుగౌడ్, కాంగ్రెస్ నాయకులు పరమేష్, తులసీరాజ్, రహ్మతుల్లా, నల్గొండ శ్రీను, బీజేపీ రాష్ట్ర నాయకుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే సీఐ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

అమరచింత: మండలంలోని ధర్మాపురం, మస్తీపురం, నందిమళ్ల ఎక్స్‌రోడ్ గ్రామాలతో పాటు పట్టణంలో మంగళవారం పోచమ్మ దేవత బోనాల పండుగను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని పోచమ్మ ఆలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ అభిషేక పూజలు నిర్వహించగా.. టీపీసీసీ రాష్ట్ర కల్లుగీత కార్మిక సెల్ చైర్మన్ కేశం నాగరాజ్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి అయూబ్‌ఖాన్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎస్‌ఐ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పోసిరిగారి విష్ణు, ప్రధాన కార్యదర్శి తాటికొండ రమేష్, కోశాధికారి కుర్వ రఘు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో..



అమరచింతలో అమ్మవారికి పూజలు చేస్తున్న కేశం నాగరాజుగౌడ్